క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే చందర్

యైటింక్లయిన్‌కాలనీ: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గం అభివృద్ధి కోసం రూ.350కోట్లు నిధులు కేటాయించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మారం సమ్మయ్య, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు, కార్పొరేటర్ రాజేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కు అందజేస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణారావుపల్లికి చెందిన కన్నం అంజయ్య, బొమ్మ పూర్ణచందర్‌కు సర్పంచ్ వెంకటలక్ష్మి గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. మాజీ ఎంపీటీసీ అంజయ్యగౌడ్, లింగయ్య ఉన్నారు.

సీనియర్ సెక్యూరిటీ గార్డుకు సన్మానం


సన్మానిస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: సీనియర్ సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన జమ్ముల జానకీరాం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా గురువారం ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ సన్మానించారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు.

భవానీ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న సురేశ్ గురుస్వామి

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ప్రధాన చౌరస్తా పోచమ్మగుడి ఆవరణలో శ్రీభవానీదీక్ష యజ్ఞ సేవా సమితి ఆధ్వర్యంలో సురేశ్ గురు భవానీ స్వామి గురువారం అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి సరైన వసతి లేదని, అన్నదానం చేయడానికి సింగరేణి అధికారులు గానీ ప్రభుత్వ రెవెన్యూ అధికారులు గానీ స్పందించి 20గుంటల స్థలం కేటాయించాలని కోరారు. కార్పొరేటర్ దీటి బాలరాజ్‌కుమార్, సమితి సభ్యులు కొక్కెర రమేశ్‌బాబు, పెగడ సతీశ్, సదానందం, శ్రీనివాస్, వెంకటేశ్, రాంబాబు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం
పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండా కూడలిలో గురువారం దారుల్‌ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. అహ్మద్, ఆదిల్, వాజిద్, ఫహీం, ఇబ్రహీం, సాదిక్‌పాషా, ముకీద్ తెలిపారు.

ఆలయంలో గాయత్రి హోమం



జ్యోతినగర్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యే పూజలు నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని అంజనేయ స్వామి దేవాలయంలో గురువారం అర్చకులు రుద్రభట్ల శ్రీఖాంత్ శర్మతో పాటు పలువురు బ్రాహ్మణులు గాయిత్రి హోమం నిర్వహించారు. నూతన యజ్ఞోపవీత ధారణ ప్రసాదంగా స్వీకరించారు. పూజల్లో రుద్రభట్ల సత్యనారాయణ, ధనుంజయశర్మ, రఘునాథన్, వినీత్‌ఝా, సంతోష్‌శర్మ పాల్గొన్నారు.

‘డబుల్’ కోసం ఎదురుచూపులు

- ఐదేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం
- అయోమయంలో లబ్ధిదారులు


అంతర్గాం మండల కేంద్రంలో కొనసాగుతున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం

రామగుండం: 2018లో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు డబుల్‌బెడ్రూం పథకంలో ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. కాగా గ్రామాల వారీగా డబుల్‌బెడ్రూం నివాస సముదాయాల నిర్మాణానికి స్థలాల ఎంపిక, గృహ నిర్మాణాలు ప్రారంభించకముందే గ్రామాల వారీగా తహసీల్దార్ సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

కొనసాగుతున్న పనులు..
అంతర్గాం మండల కేంద్రంలో గోలివాడ, విలేజి అంతర్గాం, అంతర్గాం గ్రామాల లబ్ధిదారులకు ఒకేచోట గృహ సముదాయ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. 2017లో అంతర్గాం మండల పరిధిలోని సోమనపల్లి, కుందనపల్లి, బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి, అంతర్గాం, లింగాపూర్, రాయదండి గ్రామాల్లో డబుల్ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం గుర్తించినప్పటికీ సదరు స్థలం నిర్మాణ యోగ్యత లేకపోవడంతో నిర్మాణ కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. దీంతో ఎల్లంపల్లి, మద్దిర్యాల, ముర్మూర్, గోలివాడ, పొట్యాల గ్రామాల్లో అనువైన ప్రభుత్వ భూమి లభ్యత లేకపోవడంతో భూసేకరణ చేపట్టలేదు.

ఐదేళ్ల క్రితమే లబ్ధిదారుల ఎంపిక..
అక్టోబర్ 2017లో నిర్మాణాలు ప్రారంభించే క్రమంలోనే గ్రామాల వారీగా లాటరీ విధానంతో లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. తొలివిడత 2018 మే నెలలో కుందనపల్లి–20 మంది, అంతర్గాం –60 మంది, లింగాపూర్, రాయదండి, ఎగ్లాస్‌పూర్ గ్రామాల్లో 20 మంది చొప్పున లబ్ధిదారుల ఎంపిక చేశారు. రెండో విడత 2019 జనవరిలో కుందనపల్లి–10 మంది, బ్రాహ్మణపల్లి–30, ఆకెనపల్లి–20, లింగాపూర్–5, రాయదండి–10, ఎగ్లాస్‌పూర్–10, మద్దిర్యాల–20, ముర్మూర్–10, గోలివాడ–30, పొట్యాల–10 మంది లబ్ధిదారులను గుర్తించారు. మూడో విడత 2021 అక్టోబర్‌లో రాయదండి–30, ఎల్లంపల్లి–10, మద్దిర్యాల–20, ముర్మూర్–10 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పంచాయతీ రికార్డుల్లో పేర్కొన్నారు.

అయోమయంలో లబ్ధిదారులు..
గ్రామ పంచాయతీ ప్రాంగణంలో ఆనాటి తహసీల్దార్ సాక్షిగా లాటరీ విధానంలో ఎంపిక చేసిన లబ్ధిదారులు ప్రస్తుతం అయోమయంలో పడ్డారు. కొన్ని గ్రామాల్లో డబుల్ ఇళ్ల నిర్మాణానికి స్థలం గుర్తించినప్పటికీ నిర్మాణాలు ప్రారంభించకపోవడం, మరికొన్ని గ్రామాల్లో అసలు నిర్మాణానికి స్థల ఎంపిక చేయకపోవడంతో సదరు గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారులు ఆశలు వదులుకుంటున్నారు. ఇప్పటికే సదరు గ్రామాల వారిని గృహలక్ష్మి పథకంలో ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రశీదు ఇవ్వలేదు



ఐదేళ్ల క్రితం పంచాయతీ కార్యాలయంలో లాటరీ విధానంలో డ్రా తీస్తే నా పేరు వచ్చింది. నన్ను లబ్ధిదారుగా గుర్తించిన అధికారులు నాకు మాత్రం ఎలాంటి రశీదు ఇవ్వలేదు. అప్పటికీ ఇంకా నిర్మాణాలు కూడా ప్రారంభం కాలేదు. ప్రభుత్వ అధికారులు కదా తప్పకుండా నాకు డబుల్ బెడ్రూం వస్తుందని సంతోషపడ్డాం. ఇప్పుడేమో పరిస్థితి మరోలా ఉంది. – మాద లక్ష్మి, పూర్వపు లబ్ధిదారు, గోలివాడ

కలెక్టర్ పరిధిలో ఉంటుంది



ఐదేళ్లక్రితం లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిసింది. కానీ ఇప్పుడు వారందరినీ పరిగణనలోకి తీసుకొని నూతనంగా లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదించాం. అర్హులకు డబుల్ బెడ్రూం గృహాల పంపిణీ తదితర అంశాలు పూర్తిగా ప్రత్యేక కమిటీతో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవహరించాల్సి ఉంటుంది. – పి.రామ్మోహన్‌రావు, తహసీల్దార్, అంతర్గాం


సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లిలో తమ్ముళ్లకు రాఖీ కడుతున్న అక్కలు


సుల్తానాబాద్: సోదరుడికి రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత


కమాన్‌పూర్‌లో రక్షాబంధన్ వేడుకలు


కాల్వశ్రీరాంపూర్: అక్కాచెల్లెళ్లకు కానుకలు

ఘనంగా రక్షాబంధన్

జిల్లావ్యాప్తంగా గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రజలు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కట్టారు. అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లకు కట్నకానుకలు బహూకరించారు. తోబుట్టువులకు ఆత్మీయ చిహ్నంగా రక్షాబంధన్ నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


గోదావరిఖనిటౌన్: కుక్కకు రాఖీ కడ్తున్న ఉపేంద్రమ్మ


యైటింక్లయిన్‌కాలనీ: సోదరులకు రాఖీ కడుతున్న సోదరీమణులు

శిథిలావస్థలో ఎస్సీ బాలుర వసతి గృహం


పిచ్చిమొక్కలతో నిండిపోయిన బాలుర ఎస్సీ హాస్టల్

రామగుండం: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానం సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ రెండేళ్లుగా పూర్తిగా మూతపడింది. హాస్టల్ శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో వసతి గృహంలోని గదుల్లో స్లాబ్ నుంచి వర్షపు నీరు గదిలోకి చేరి కూలిపోయే స్థితికి చేరింది. విద్యార్థుల పేరెంట్స్ తమ పిల్లల భద్రతా కారణాల దృష్ట్యా హాస్టల్ నుంచి బయటకు వచ్చేశారు. ఫలితంగా ఏటా ప్రవేశాల సంఖ్య క్రమంగా తగ్గుతుండడంతో రెండేళ్లుగా హాస్టల్ పూర్తిగా ఖాళీ అయిపోయింది. ప్రస్తుతం పిచ్చిమొక్కలు పెరగడంతో హాస్టల్ భవన ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోయాయి. నాలుగేళ్ల క్రితం ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో ఆధునిక వసతులతో కూడిన హాస్టల్ భవనాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చినప్పటికీ ప్రజాప్రతినిధులు హాస్టల్ నిర్మాణం చేపట్టాలనే ఆసక్తి చూపించకపోవడంతో ఆశలు ఆవిరయ్యాయి. ఎస్సీ హాస్టల్ లేకపోవడంతో హైస్కూల్‌లో ప్రవేశాల సంఖ్యపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్‌ఎం తానం స్వర్ణ పేర్కొన్నారు.



శిథిలావస్థలో ఆలయం షెడ్డు

రామగుండం: గోదావరి నదిలో వరద ఉధృతి కారణంగా అంతర్గాం గోదావరి ఒడ్డున శివాలయం పూర్తిగా వరద ముంపులోకి చేరింది. వరద ముంపు తగ్గడంతో శివాలయం పరిసరాలు పూర్తిగా బురదమయమై రేకుల షెడ్డు వంగిపోయి శిథిలావస్థకు చేరింది. దాతలు స్పందించి రేకుల షెడ్డు ప్రాంగణాన్ని పునరుద్ధరించేందుకు సహకరించాలని భక్తులు కోరుతున్నారు.

అమెరికా పర్యటనలో ‘సోమారపు’



పాలకుర్తి: ఆర్టీసీ మాజీ చైర్మన్, బీజేపీ నాయకులు సోమారపు సత్యనారాయణ కుటుంబ సమేతంగా అమెరికా వెళ్లారు. ఈనెల 3న సోమారపు సత్యనారాయణ మనుమడు కీర్తిప్రేమ్ వివాహం అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో జరగనున్న నేపథ్యంలో సోమారపు సత్యనారాయణతో భార్య భారతి, కుమారుడు సోమారపు అరుణ్, కోడలు లావణ్య, మనుమలు అమెరికాకు వెళ్లారని, దాదాపు 10రోజుల అనంతరం తిరిగి ఇండియాకు వస్తారని పార్టీ నాయకులు తెలిపారు.

నిరుపేదలకు చీరలు పంపిణీ
జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ సాయి సేవాసమితి ఆవరణలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో సీనియర్ లయన్ సభ్యులు బంక రామస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు అన్నదానం, చీరలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఉప అధ్యక్షురాలు జయప్రద, సెక్రటరీ కళావతి, ట్రెజరర్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీభక్తమార్కండేయ రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో పద్మశాలీలు గురువారం శ్రీభక్త మార్కండేయ రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మహిళల మంగళహారతులతో పురవీధుల గుండా ఉత్సవమూర్తి విగ్రహం ఊరేగింపు భజనలు, కీర్తనలతో మారుమోగింది. సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు సబ్బని రాజమల్లు, గ్రామ అధ్యక్షుడు గోలి సదాకర్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్


స్థానికులతో మాట్లాడుతున్న సీఐ

మంథని: నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంథని ఇన్‌చార్జి సీఐ అఫలుద్దీన్ తెలిపారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వార్డులో సోదాలు నిర్వహించారు. వాహన పత్రాలు సరిగ్గా లేని 30 బైక్‌లను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రలాపాలకు పాల్పడొద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమస్యలుంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. మంథని ఎస్సై కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా యజ్ఞోపవీతధారణ


జంధ్యం మార్చుకుంటున్న పద్మశాలీలు

యైటింక్లయిన్‌కాలనీ: జంధ్యాల పౌర్ణమి సందర్భంగా గురువారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో జంజిరాల పండుగ ఘనంగా నిర్వహించారు. కాలనీలోని పద్మశాలీలు స్థానిక హనుమాన్ ఆలయంలో యజ్ఞోపవీత ధారణ చేశారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని శాస్త్రినగర్ ఉన్న బీసీ డిగ్రీ గురుకుల కళాశాలలో సెప్టెంబర్ 4లోగా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి గురువారం తెలిపారు. డిగ్రీ కళాశాలలో బీఏ,(ఆర్థిక, రాజకీయ శాస్త్రం, చరిత్ర), బీకాం, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ (గణితం, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) కోర్సుల్లో ప్రవేశం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. బీసీ గురుకుల కళాశాలలో ప్రవేశం కోసం ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 4లోగా ప్రవేశం కోసం ఇ.నం.6–20/ఎఫ్1, ఎఫ్2, శాస్త్రినగర్, సుల్తానాబాద్‌లో గల కళాశాలకు నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు సెల్ నంబర్ 99593 83509 నందు సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో సూచించారు.



ప్రమాదకరంగా కల్వర్టు

ముత్తారం: మండలంలోని ఇప్పలపల్లి(రామకృష్ణాపూర్)–సీతంపల్లి మధ్యలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఎస్సారెస్పీ కాలువ కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. రోడ్డు సమానంగా బాగానే ఉందని వస్తున్న వాహనాదారులు కాలువ కల్వర్టు గమనించక అందులో పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని స్థానికులు చెప్తున్నారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు ఈ ప్రమాద కల్వర్టును పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా కల్వర్టుకు రక్షణగోడలు నిర్మించాలని, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పౌరహక్కుల దినోత్సవం


ఓదెల: మాట్లాడుతున్న ఆర్‌ఐ రాజేందర్

కమాన్‌పూర్: మండలంలోని గుండారం ఎస్సీ కాలనీలో గురువారం అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సై బేతి రాములు, సర్పంచ్ ఆకుల ఓదెలు, ఉపసర్పంచ్ చంద్రమౌళి, ఆర్‌ఐ సంధాని, పంచాయతీ కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని పెద్దకొమిరలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఆర్‌ఐ బండ రాజేందర్ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే ఫంక్షన్లలో వివక్షత ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ ఐరెడ్డి సరోజన వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం ఎస్సీ కాలనీలో పౌరహక్కులు, బాధ్యతలు, అంటరానితనంపై రెవెన్యూ, పోలీసుశాఖ నేతృత్వంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఐ వైశాలి, సర్పంచ్ కొనుకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ కదురు మానస, ఉపసర్పంచు మేడి తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దారు బషీరోద్దీన్, బీసీ వెల్ఫేర్ సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, ఆర్‌ఐ సదయ్య, ఏఎస్సై రాజిరెడ్డి, నాయకులు శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా జమీల్


నియామక పత్రం అందుకుంటున్న జమీల్

మంథని: కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మంథనికి చెందిన జమీల్ నియామకమయ్యారు. అలాగే బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోటికార్ కిషన్, మంథని మండలం బీసీ సెల్ అధ్యక్షుడిగా ఐలి శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సమ్మయ్య

గోదావరిఖని: రాఖీ పండుగ సందర్భంగా షాపింగ్ చేస్తున్న క్రమంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు గురువారం అప్పగించారు. రామగిరి మండలం సుందిళ్ల గ్రామానికి చెందిన గడ్డం లావణ్య పట్టణంలోని లక్ష్మీనగర్‌లో షాపింగ్ చేస్తుండగా రూ.20వేల విలువ గల సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. దీనిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేసి ఫోన్ గుర్తించి సదరు మహిళకు వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య అప్పగించారు.